క్లుప్తంగా

రేపు మండల సమావేశం

మదనపల్లె రూరల్ : మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో జరుగుతుందని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ తెలిపారు. మండలస్థాయి అధికారులు మూడునెలలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

18న ప్రభుత్వ జీపు వేలం

మదనపల్లె రూరల్ : ఐసీడీయస్ మదనపల్లె ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రభుత్వ వాహనం ఏపీ21, బీ–2231 జీపును ఈనెల 18వ తేదీన కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు సీడీపీఓ నాగవేణి తెలిపారు. సోమవారం ఐసీడీయస్ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో....ఆర్‌టీఓ కార్యాలయ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్, జీపు విలువ రూ.26,400 రూపాయలుగా ధృవీకరించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.1,000, డీడీని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, మదనపల్లె పేరు మీద తీసుకుని 18వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక ఐసీడీయస్ కార్యాలయంలో సమర్పించి, బహిరంగ వేలంలో పాల్గొనవచ్చన్నారు.

అన్నదానం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో సోమవారం 1995–1996 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వీరు హెల్పింగ్ హ్యాండ్స్ కమిటీ పేరుతో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేశారు. నిరుపేదలకు డబ్బు సాయం చేసి మానవత్వం చాటుకున్నారు. కమిటీ అధ్యక్షుడు సులేమాన్, రెడ్డిబాషా, శ్రీకాంత్, శంకర్‌రెడ్డి, నాగరాజు, ఫిరోజ్ పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అరుద్ర నక్షత్రం సందర్భంగా వేద పండితులు వేణుగోపాల్ శర్మ, శేషాచల శర్మలు శివ, పార్వతుల ప్రతిమలను ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి కల్యాణం వేడుకగా నిర్వహించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

పీలేరు : ఈ నెల 14న కర్నూలులో జరిగిన జీకేఎంఏ 12వ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో పీలేరులో యోదా కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరాటే మాస్టర్ జి. ఇనాముల్ హక్ తెలిపారు. సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొన్న కాంపిటీషన్‌లో యోదా కరాటే అకాడమీ ఉంచి గీతశ్రీ, వికాస్, పరూక్, ముదిత్, సాయి, సావన్, సహస్ర, అశ్విన్, పునీత్ మొత్తం 9 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీలో ఏడు బంగారు పతకాలు, 3 వెండి పతకాలు, 2 కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రామసముద్రం : మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప తెలిపారు. సోమవారం ఆయన ఏఈ రియాజ్‌తో కలిసి తాగునీటి సమస్య ఉన్న మినికి, గుండ్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. మినికిలో రీబోర్ చేసేందుకు చర్యలు చేపట్టాలని సర్పంచుకు సూచించారు. అలాగే గెవితిమ్మరాయ స్వామి ఆలయం వద్ద స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ.6లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణం పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే చెంబకూరు సమీపంలోని శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి ఆలయానికి స్వచ్ఛ భారత్ మిషన్ కింద రెండు యూనిట్ లు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్ రూ. 6లక్షలతో మంజూరైనట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె రూరల్ : బైక్ అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన ఆనంద్(56) స్కూల్‌బస్సు అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ద్విచక్రవాహనంలో విధులకు వెళుతుండగా, మార్గమధ్యంలోని శానిటోరియం తురకపల్లె వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సోమేశ్వరుడికి రుద్రాభిషేకం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి రుద్రాభిషేకం చేశారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ స్వామికి విశేషంగా అభిషేకం చేసి అలంకరణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక బెంగుళూరురోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సచివాలయం ఉద్యోగుల సమస్యలపై స్పందించాలి

మదనపల్లె: సచివాలయం ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారం చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసి రాష్ట్ర ప్రచార కార్యదర్శి గుడి నాగరాజా డిమాండ్ చేశారు. సోమవారం సచివాలయం ఉద్యోగుల సమావేశం ఎన్జీవో కార్యాలయంలో జరిగింది. జేఏసీ నాయకులు మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులకు వలంటీర్ల విధుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు.

మెడికల్ కాలేజీల

పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

సబ్ కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల నిరసన ప్రదర్శన



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు

మదనపల్లె రూరల్ : రాష్ట్రంలోని 10 కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసి పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని మదనపల్లె అభివృద్ధి వేదిక, ప్రజాసంఘాల ఐక్యవేదిక, విద్యార్థిసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో వైద్యవిద్య పేదవిద్యార్థులకు దూరమవడంతో పాటు నాణ్యమైన వైద్యం అందకుండా పోతుందన్నారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన చంద్రబాబు...ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన మెడికల్ కాలేజీలను, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి కమీషన్లు దండుకోవడమే పనిగా పెట్టుకున్నట్లు తెలుస్తోందన్నారు. చంద్రబాబు పాలనలో ఒక మెడికల్ కాలేజీ తీసుకువచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వ కాలేజీలుగా ప్రారంభం అయిన వాటిని మళ్లీ పీపీపీ పద్ధతిలోకి గాని, మరే ఇతర ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం దేశంలో ఇప్పటివరకు ఎక్కడా జరగలేదన్నారు. విద్యార్థులు ప్రైవేటు కాలేజీల ఫీజులను భరించే పరిస్థితుల్లో లేరన్నారు. దీంతోపాటు ప్రైవేట్ వ్యక్తులకు బోధనాసుపత్రిని అప్పగిస్తే..వైద్యం కోసం వసూలు చేసే ఫీజులు భారీగా ఉంటాయన్నారు. సామాన్యులు, మధ్యతరగతి, పేదప్రజలు వాటిని భరించలేరన్నారు. ఇంతేకాకుండా ప్రభుత్వం ఎన్నో వ్యయప్రయాసలుకు ఓర్చి సేకరించిన భూములు, కల్పించిన మౌలికసదుపాయాలు అన్నీ కూడా ప్రైవేటు వ్యక్తుల పరమవుతాయన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, సామాజిక బాధ్యత ఇవన్నీ లోపిస్తాయన్నారు. మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో కొనసాగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకుని, ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, పీపీపీ విధానాన్ని రద్దు చేసేంతవరకు పోరాడుతామన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు రెడ్డిసాహెబ్, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సీపీఐ మురళీ, ఏఐఎస్‌ఎఫ్ మాధవ్, జంగాల రమణ, విద్యార్థిసంఘనాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పీజీఆర్‌ఎస్‌లో సబ్ కలెక్టర్‌కు ప్రజల వినతి

మదనపల్లె రూరల్ : చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల ప్రజలు సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి వినతిచేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. మదనపల్లెలో నివాసం ఉంటున్న సువారపు ప్రమీలమ్మ...తన తండ్రి పేరుమీద కురబలకోట మండలం మట్లివారిపల్లె రెవెన్యూ సర్వేనెంబర్.1335/1లోని 5.14 ఎకరాల వ్యవసాయభూమిని, ఏకైక కుమార్తె అయిన తన పేరుమీద 1బీ, పట్టాదారు పుస్తకంను మంజూరుచేయాల్సిందిగా వినతిచేసింది. ఈ భూమిని ప్రస్తుతం దొడ్డ ఛాయాపతి చెల్లెలు కొండపల్లె సుజాత తన పేరుపై మార్చుకునేందుకు ప్రయత్నం చేస్తోందని, తన తండ్రి భూమి తనకే చెందేలా చూడాలని అర్జీ సమర్పించింది. బి.కొత్తకోట మండలం పాళంవీధికి చెందిన ఎస్.ఉత్తన్న... బి.కొత్తకోట గ్రామం సర్వేనెం.239లోని 28 సెంట్ల భూమి, తమ ముగ్గురు అన్నదమ్ములకు భాగం ఉండగా, చిన్నాన్న కుమారుడు ఎస్.ఆంజనేయులు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని తనపేరుపై ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోవడమే కాకుండా పాసుపుస్తకం పొందాడన్నారు. ఇదేభూమికి తమ వద్ద పాసుపుస్తకం ఉందని, కోర్టులో కేసు వేయగా, తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, దురుద్దేశంతో తీసుకున్న పాసుపుస్తకాలను రద్దుచేయాల్సిందిగా కోరారు. మదనపల్లె మండలం వలసపల్లె సర్వేనెం.531/1లోని 56 సెంట్లు భూమి ప్రొహిబిటెడ్ లిస్టులో ఉందని సబ్ రిజిస్ట్రార్ పేర్కొన్నారని, ఈ విషయమై పలుమార్లు తాము అర్జీలు సమర్పించినా అందులో నుంచి తొలగించడం లేదని, తమ భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాల్సిందిగా పుంగనూరు మండలం బోడేవారిపల్లెకు చెందిన యస్.రాజాబాబు అర్జీ సమర్పించారు.

కలలకు రూపమిచ్చే సూపర్ హీరోలు ఇంజినీర్లు



ఇంజినీర్స్‌డేలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్‌ఈ ఆర్. విట్టల్ ప్రసాద్



మాట్లాడుతున్న రిటైర్డు పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ కె.అమరనాథరెడ్డి

కురబలకోట: ఇంజినీరింగ్ అనేది సాదాసీదా వృత్తి కాదని, సమాజాన్ని మార్చే శక్తి అని హంద్రీనీవా సుజల స్రవంతి ఎస్‌ఈ ఆర్. విట్టల్ ప్రసాద్ కొనియాడారు. కలలకు రూపమిచ్చే సూపర్ హీరోలుగా ఇంజినీర్లు గురించి చెప్పవచ్చన్నారు. ఇంజినీర్స్‌డే వేడుకలను పురస్కరించుకుని అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో సోమవారం అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య దేశ జాతికే గర్వకారణమన్నారు. ఇంజినీరింగ్ ప్రతిభతో మోక్షగుండం దేశ ఖ్యాతిని నలుదిశలా చాటారన్నారు. అత్యున్నత శిఖరాలను అధిరోహించి ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాలను ఆవిష్కరించారన్నారు. ఆయన నిర్మాణాలు నేటికి చెక్కు చెదరలేదన్నారు. ఇంజినీరింగ్‌తో సుస్థిర నిర్మాణాలు అంతకు మించి మంచి భవిష్యత్తు సాధ్యమన్నారు. ముఖ్యంగా ఇంజినీర్లు మార్పునకు రూప శిల్పులని విశ్వేశ్వరయ్య మార్గదర్శకంగా నేటి విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యలో రాణించి గొప్ప ఆవిష్కరణలతో ముందుకు సాగాలన్నారు.

ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరురోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రిటైర్డు పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ కె.అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఇంజినీర్లు సమాజ నిర్మాణంలో పోషించే పాత్రను ప్రత్యేకంగా గుర్తు చేశారు. రహదారులు, వంతెనలు, నీటిపారుదల ప్రాజెక్టులు, ఆధునిక సాంకేతికత ప్రతి రంగంలో ఇంజనీర్ల కృషి అపూర్వమని తెలిపారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ ఇంజనీర్ అనేది కలలను వాస్తవరూపంలోకి మార్చే శక్తి అన్నారు. ప్రతి విద్యార్థి సమాజానికి ఉపయోగపే ఆవిష్కరణలతో ముందుకు సాగాలన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రాజెక్టు ఎక్స్‌పోలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ పి.రాయుడు,అధ్యాపకులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే



కబడ్డీ ఆడుతున్న సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు

మదనపల్లె సిటీ: చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు అన్నారు. సోమవారం మండల స్కూల్ గేమ్స్ పోటీలు సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మండలం నుంచి సుమారు 360 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, అండర్–14,17 బాల,బాలికల విభాగాల్లో పోటీలు జరిగాయి. క్రీడలను హెచ్‌ఎం చంద్రశేఖర్ ప్రారంభించారు. అండర్–14 బాలికల కబడ్డీలో జెడ్పీ ఉన్నత పాఠశాల సిటీఎంవిన్నర్స్‌గా, మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల రన్నర్‌గా నిలిచింది. అండర్–17 కబడ్డీ బాలికల విభాగంలో గవర్నమెంట్ ఉన్నత పాఠశాల మదనపల్లె విజేతగా, సీటీఎం జడ్పీ ఉన్నత పాఠశాల రన్నర్స్‌గా నిలిచింది. అండర్–14 కబడ్డీ విభాగంలో జడ్పీ ఉన్నత మదనపల్లె విన్నర్స్‌గా, జడ్పీ ఉన్నత పాఠశాల పెంచుపాడు రన్నర్స్‌గా నిలిచాయి. అండర్–17 బాలుర విభాగంలో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విన్నర్స్‌గా, జ్ఞానోదయ ఉన్నత పాఠశాల రన్నర్స్‌గా నిలిచింది. వాలీబాల్ అండర్–17 బాలుర విభాగంలో జెడ్పీ ఉన్నత పాఠశాల మదనపలెల విన్నర్స్‌గా, వశిష్ట స్కూల్ రన్నర్‌గా గెలుపొందాయి. అండర్–17 బాలికల విభాగంలో గర్నమెంటు ఉన్నత పాఠశాల మదనపల్లె విన్నర్స్‌గా, వశిష్ట స్కూల్ రన్నర్స్‌గా నిలిచింది. అండర్–17 బాలికల చెస్ విభాగంలో వశిష్ట స్కూల్ విన్నర్స్‌గా, జెడ్పీ ఉన్నత పాఠశాల,సిటీఎం రన్నర్స్‌గా అండర్–14 బాలికల చెస్ విభాగంలో వశిష్ట స్కూల్ విన్నర్స్‌గా,, జెడ్పీ ఉన్నత పాఠశాల సీటీఎం రన్నర్స్‌గా గెలుపొందాయి. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శివశంకర్,పీడీలు దేవకమ్మ, నరేష్, గిరిధర్‌నాయక్, భద్రయ్య, అన్సర్,లత, భారతి, ఆంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

రామసముద్రం : మండలంలోని గాజులనగరంలో రెండు వర్గాలుగా ఏర్పడి బహిరంగ ప్రదేశంలో గొడవ పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. సోమవారం ఉదయం గాజులనగరంలో రెండు వర్గాలు ఒకరినొకరు గొడవపడి దూషించుకోవడంతో పాటు గ్రామంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించారన్నారు. ఈ సంఘటనలో మొత్తం 21 మంది వ్యక్తులు పోలీసు అధికారులు చట్టం, శాంతి భద్రత కాపాడేందుకు విధులు నిర్వర్తిస్తున్న సమయంలో కూడా ఆదేశాలను లెక్క చేయకుండా ప్రజా స్థలంలో హంగామా సృష్టించారన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒకే వ్యక్తికి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



మధుమోహన్

పీలేరురూరల్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక్క ప్రభుత్వం సాధించడం గగనం.. ఇలాంటి తరుణంలో ఒకే వ్యక్తి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. వివరాల్లోకి వెళితే... పీలేరు పట్టణం బండ్లవీధికి చెందిన గుండ్లూరి మధుమోహన్ మొదట మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో అసిస్టెంట్ లైబ్రేరియన్ ఉద్యోగం పొంది విధుల్లో చేరాడు. ఇదిలా ఉండగా ఇటీవల ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీలో ఎస్‌జీటీ జాబ్ సాధించాడు. అలాగే 2025లో విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై మెడికల్ టెస్ట్ కూడా పూర్తి చేసుకున్నాడు. ఎస్‌జీటీ, కానిస్టేబుల్ ఉద్యోగాలు రెండూ స్పోర్ట్స్ కోటాలో వచ్చినట్లు మధుమోహన్ తెలిపారు. మధుమోహన్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

మల్లయ్యకొండపై భక్తుల సందడి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువైంది. మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి మల్లయ్యకొండను సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు ఆయనకు స్వాగతం పలికి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి కళాకారులు మల్లయ్యకొండకు వచ్చారు. కోలాటలు, భజనలు, పిల్లనగ్రోవి బృందాలు అలరింపజేశారు. ఈఓ మునిరాజ, కొండ కిట్టలు దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

కేవీపల్లె : గ్రామస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీఎండీసీ మాజీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గోరంట్లపల్లె పంచాయతీ అంబువారిపల్లెలో ఓ ప్రయివేట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేశారని తెలిపారు. ప్రతి ఇంటికీ ఆర్థిక భరోసా కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించి అక్రమ కేసులు పెట్టడం పనిగా పెట్టుకుందని విమర్శించారు. గ్రామస్థాయిలో పార్టీ నాయకులు ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా హరీష్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, ద్వారకనాథరెడ్డి, దినేష్‌రెడ్డి, చక్రధర్, లోకనాథరెడ్డి, కేశవులు, శరణ్‌కుమార్, శ్రవంత్‌కుమార్, అశోక్‌నాయుడు, శీను, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో తాగునీటి బోరు మంజూరు



ఎగువనల్లప్పగారిపల్లిలో తాగునీటి బోరుకు పూజలు చేసి ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి

రామసముద్రం : చిత్తూరు జిల్లా పరిషత్ నిధులతో తాగునీటి బోరు మంజూరు చేసి వేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ రామచంద్రా రెడ్డి తెలిపారు. సోమవారం ఆర్. నడింపల్లి పంచాయతీ ఎగువనల్లప్పగారి పల్లి గ్రామంలో రూ.3 లక్షల జెడ్పీ నిధులతో నూతనంగా తాగునీటి బోరు వేసేందుకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ప్రజలు తమ దృష్టికి తీసుకురావడంతో జిల్లా పరిషత్ నుంచి తన గ్రాంటు లో నిధులు మంజూరు చేయించానన్నారు. తాగునీటి సమస్య పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వర్షాభావం కారణంగా గ్రామాల్లో తాగునీటి బోరులో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

నిమ్మనపల్లె : పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చూపవద్దని ఎంపీడీఓ రమేష్‌బాబు, గ్రీన్ అంబాసిడర్లను ఆదేశించారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో ఉదయం 6 గంటలకే చెత్తసేకరణ మొదలుపెట్టాలన్నారు. 8 గంటలకల్లా సేకరించిన చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. మురుగుకాలువల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో స్వామిత్వ సర్వేపై సమీక్ష నిర్వహించారు. మండలంలోని రాచవేటివారిపల్లె, మాచిరెడ్డిగారిపల్లె, రెడ్డివారిపల్లె, బండ్లపై గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్ర సర్వే రెండురోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి మూడు బృందాలను పంపించి సత్వరమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు పాల్గొన్నారు.

దాదంవడ్డిపల్లెకు తాగునీటి సౌకర్యం



తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

తంబళ్లపల్లె: మండలంలోని పరసతోపు పంచాయతీ దాదంవడ్డిపల్లెలో తాగునీటి బోరు చెడిపోయి సుమారు 100 కుటుంబాల వారు తాగునీటి కోసం పడేవారు. ఈ అవస్థలపై సోమవారం సాక్షి దినపత్రికలో దాదంవడ్డిపల్లెలో తాగునీటి సమస్య అన్న వార్త ప్రచురితమైంది.దీనిపై ఎంపీడీఓ థామస్, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ స్పందించారు. అక్కడ బోరు మోటారు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించారు. పుష్కలంగా నీరు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాల స్థలం దురాక్రమణపై ఫిర్యాదు

పీలేరు : ప్రభుత్వ పాఠశాల స్థలం దురాక్రమణపై మాలమహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ సోమవారం తహసీల్దార్ శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీ మారంరెడ్డిగారిపల్లె ప్రభుత్వ పాఠశాల స్థలం సర్వ నెంబరు 76/1లో 5 సెంట్లు భూమిని మాజీ సర్పంచ్ భర్త ధర్మరాజు ఆక్రమించుకుని ఆవుల షెడ్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలని కోరారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ పోటీలు

రామసముద్రం : మండలంలోని చెంబకూరు జెడ్పీ హైస్కూల్ మైదానంలో మంగళవారం నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఆంజనేయులు, ఎస్ జీఎఫ్ కోఆర్డినేటర్ దిలిప్ కుమార్, హెచ్ ఎం రమేష్ బాబులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు అండర్14, అండర్17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, యోగ, షటిల్ బాడ్మిటన్, చెస్, బ్యాట్మింటన్, అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి నాగరాజు, ఉప కార్యదర్శి ఝాన్సీ తెలిపారు.

17 నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

నిమ్మనపల్లె : మండలస్థాయి క్రీడాపోటీలు ఈనెల17 నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పద్మావతి, నిమ్మనపల్లె హైస్కూల్ హెచ్‌ఎం అంజాద్‌అలీఖాన్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ...నిమ్మనపల్లె జెడ్పీహైస్కూల్(తెలుగు)లో 17న వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, బాడ్మింటన్, యోగా పోటీలు 18న అథ్లెటిక్స్ క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు డివిజన్‌స్థాయిలో పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమవెంట హెచ్‌ఎంచే ధృవీకరించిన మిడ్ డే మీల్ సర్టిఫికేట్, ఈవెంట్ ఎంట్రీ ఫారం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శారద, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

పీలేరు : మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీ బసిరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేంద్రరెడ్డి తల్లి లక్ష్మమ్మ వారం రోజుల క్రితం మృతి చెందింది. సోమవారం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బసిరెడ్డిగారిపల్లెకు చేరుకుని లక్ష్మమ్మ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మండలంలోని తలపుల పంచాయితీ చెరుకువారిపల్లెకు చెందిన హరినాథరెడ్డి సోమవారం మృతి చెందారు. వారి గ్రామానికి వెళ్లి హరినాథరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రారెడ్డి, బాలం నరేంద్రరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, అమరనాథరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వినోద్‌కుమార్‌గౌడ్, బుల్లెట్ శేఖర్, రమణ, ఆనంద్, నాగభూషణం, చక్రధర్, పి. ద్వారకనాథరెడ్డి, షాకీర్, కాలనీ చిన్న, సురేంద్రరెడ్డి, నారే వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో గాలికుంటు వ్యాధి నివారణ



నిమ్మనపల్లె : వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పశువైద్యులు సురేష్ సాధు



తంబళ్లపల్లె: పాడి ఆవులకు టీకాలు వేస్తున్న డాక్టర్ విక్రమ్‌రెడ్డి



ములకలచెరువు: గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ వైద్యులు

నిమ్మనపల్లె : టీకాలతో పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ సాధ్యమవుతుందని మండల పశువైద్యాధికారి వి.సురేష్ సాధు అన్నారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలోని నాలుగు నెలలు వయస్సు పైబడిన అన్ని పశువులకు సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు నెలరోజుల పాటు ఉచితంగా గ్రామాల్లో పశువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పాడిపశువుల్లో సోకే అతి ప్రమాదకరమైన వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటన్నారు. ఈ వ్యాధిబారిన పడిన పశువుల్లో నాలుక మీద బొబ్బలు రావడం, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడి సరిగ్గా నడవలేకపోవడం, సరిగ్గా మేతతినలేక నీరసించి పాలదిగుబడి తగ్గిపోవడం జరుగుతుందన్నారు. వ్యాధి తీవ్రత పెరిగితే పశువులు మృతిచెందే అవకాశం ఉందన్నారు. టీకాలు వేసిన పశువుల్లో మొదటి రెండు, మూడు రోజులు పాలదిగుబడి తగ్గి మళ్లీ పెరుగుతుందన్నారు. రైతులు అందుకు భయపడటం , అపోహ చెందడం అవసరం లేదన్నారు. పాడిరైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పశువులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గురురాజ్, గుర్రప్ప, బాబా తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

తంబళ్లపల్లె: మండలంలో జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ విక్రమ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కన్నెమడుగులో సుమారు 84 పశువులకు టీకాలు వేశారు. మండలంలోని 10,500 పశువులకు అక్టోబర్ నెల 15వతేదీ వరకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. గాలికుంటు వ్యాధి వేగంగా సంక్రమించే ప్రాణాంత వ్యాధి అన్నారు. పశువులకు మృత్యువాతపడి రైతులు నష్టపోతారన్నారు. రైతులు తప్పకుండా తమ పశువులకు నాలుగు నెలల వయసు పైబడిన పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

పాడి ఆవులకు టీకాలు

ములకలచెరువు: పాడి ఆవుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేయించాలని వెటర్నరీ డాక్టర్ నివేదిక అన్నారు. సోమవారం మండలంలోని బురకాయలకోట, మద్దినాయునిపల్లె పంచాయతీల్లో పాడి ఆవులకు సిబ్బందితో కలిసి టీకాలు వేశారు. అనంతరం గాలికుంటు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం అక్టోబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని, పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది శంకర్‌రెడ్డి, రిజ్వాన, రైతులు ఉన్నారు.